
సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



ఓటమి గెలుపునకు నాంది

ఓటమి గెలుపునకు నాంది అని డీఐఈవో రఘురాజ్ అన్నారు. ఆర్మూర్‌లో కబడ్డీ, ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను ప్రారంభించారు.

- 10లో ▸



జోరుగా కల్తీకల్లు దందా

జిల్లాలో జోరుగా కల్తీకల్లు దందా సాగుతోంది. బట్టీల్లో గుల్ఫారం కల్లును యథేచ్ఛగా విక్రయిస్తున్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.6 /22.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

మరింత దూకుడు

పసుపుబోర్డు అంశమే ప్రధాన ఎజెండాగా గత పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచి గెలిచిన ఎంపీ అర్వింద్ బీఆర్‌ఎస్‌కు మరో మాస్టర్ స్ట్రోక్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. స్వయాన ప్రధానమంత్రి నరేంద్రమోదీ పసుపు బోర్డును ప్రకటించడంతో ఇదే ఉత్సాహంతో అసెంబ్లీ ఎన్నికల్లో సత్తాచాటేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. నిజాంషుగర్స్ ప్రధాన అంశంగా తీసుకుని ముందుకు వెళ్తామని, చెరుకు సాగు విస్తీర్ణాన్ని పెంచి రైతులకు మేలు చేస్తామని ఎంపీ అర్వింద్ ఈ సందర్భంగా పేర్కొంటున్నారు.



- పసుపు బోర్డు సాధనతో బీజేపీలో ఉత్సాహం
- 'నిజాంషుగర్స్' ప్రధాన అంశంగా ప్రణాళిక రచిస్తున్న బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్
- చెరుకు రైతులను ఆదుకునే లక్ష్యంతో..
- నేడు మెట్‌పల్లిలో రైతులతో ఆత్మీయ సమావేశం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పసుపు బోర్డు అంశం ఫలితాన్ని శాసించింది. పసుపు బోర్డు కోసం బాండ్ పేపర్ రాసిచ్చి బరిలోకి దిగిన ఎంపీ ధర్మపురి అర్వింద్ మెజారిటీ విజయం సాధించారు. ఏకంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీని తీసుకొచ్చి పసుపుబోర్డు ప్రకటింపజేశారు. ఇదే ఊపుతో ఉత్తర తెలంగాణలో బీజేపీ ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లో సత్తాచాటే లక్ష్యంతో ప్రణాళికలు రచిస్తున్నారు. పసుపుబోర్డు నేపథ్యంలో ఆ పంట సాగు విస్తీర్ణాన్ని పెంచాలనే లక్ష్యం ముంగిటకు వచ్చామని ఎంపీ అర్వింద్ చెబుతున్నారు. ఇక ఉత్తర తెలంగాణలో చెరుకు పంటసాగు విస్తీర్ణాన్ని పెంచడమే ఎజెండాగా ముందుకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉమ్మడి కరీంనగర్‌లోని మెట్‌పల్లిలో రైతులతోఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు.

ఉత్తరప్రదేశ్ పాలసీపై అధ్యయనం

దేశంలో ఇథనాల్ వాడకం పెరుగుతున్న నేపథ్యంలో ఉమ్మడి కరీంగనర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో దాని తయారీ కోసం చెరుకు పంట సాగు విస్తీర్ణం పెంచే లక్ష్యంతో అర్వింద్ పార్టీ అధిష్టానం, కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ప్రత్యేకంగా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీలు ఉమ్మడి నిజామాబాద్(బోధన్), ఉమ్మడి కరీంనగర్(జగిత్యాల జిల్లా ముత్యంపేట), ఉమ్మడి మెదక్(ముంబోజిపల్లి)లో ఉన్నాయి. ఈ క్రమంలో అర్వింద్ ఉత్తరప్రదేశ్‌లోని చెరుకు పాలసీని స్టడీ చేస్తున్నారు. యూపీలో మాదిరిగా చెరుకు పంటసాగుతో పాటు దాన్ని రెగ్యులేట్ చేసేందుకుగాను షుగర్, బ్రౌన్ షుగర్, ఇథనాల్ అనే మూడు ఉత్పత్తుల తయారీకి ప్లాన్ చేస్తున్నారు. చెరుకుకు మద్దతు ధర ఇస్తున్న నేపథ్యంలో పశ్చిమ దేశాలతో పోలిస్తే భారత్‌లో ఉత్పాదక ఖర్చు 30శాతం ఎక్కువ ఉంటోంది. దీంతో షుగర్ ఎగుమతులు అంతగా చేయలేని పరిస్థితి. ఇథనాల్ ఉత్పత్తి లక్ష్యంగా నిజాం షుగర్ ఫ్యాక్టరీలు తెరిపిస్తామని, తద్వారా చెరుకు సాగువిస్తీర్ణాన్ని పెంచి రైతులకు మేలు చేస్తామని ఎంపీ వివరించారు. 2022 జూన్ 12, 13 తేదీల్లో జిల్లాలో కేంద్ర భారీపరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో కలిసి ఈ ప్రాంతాల్లో పర్యటించినప్పటి నుంచే చెరుకు పంట సాగు, నిజాం షుగర్స్ విషయమై సుదీర్ఘ అధ్యయనం చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. ఉత్తర తెలంగాణలో వరి, మొక్కజొన్న, చెరకు పంటల నుంచి ఇథనాల్ ఉత్పత్తి చేయడంతో పాటు ఇతర ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమలు, వ్యవసాయ అధారిత యూనిట్లు నెలకొల్పితే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయంటున్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు భారీగా సబ్సిడీలు ఇస్తున్న నేపథ్యంలో రైతులకు మరింత మేలు కలుగుతుందన్నారు.

రాష్ట్రంలో బీజేపీకి అధికారం ఇస్తే తక్షణమే జిల్లాలోని నిజాం షుగర్‌ఫ్యాక్టరీని తెరిపిస్తామని చెబుతుండడంతోపాటు దీన్నే ప్రధాన ఎజెండాగా ముందుకెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కాగా నిజామాబాద్ జిల్లాలో సాధారణ వరి సాగు 2,86,160 ఎకరాలు కాగా.. నిజాం షుగర్స్ మూతపడడంతో చెరుకు రైతులు వరికి మారడంతో 4 లక్షల ఎకరాలకు పెరిగింది.

చంద్రబాబు హయాంలో..

నిజాం షుగర్స్ పతనానికి 2002లో చంద్రబాబు ప్రభుత్వం బీజం వేసింది. అప్పట్లో రూ.308 కోట్ల విలువ కలిగి ఉన్న నిజాం షుగర్స్ కర్మాగారాన్ని కేవలం రూ.65.45 కోట్లకు డెల్టా పేపర్ మిల్స్ అనే ప్రైవేటు కంపెనీకి విక్రయించారు. తర్వాత వైఎస్సార్ ప్రభుత్వం ఈ వ్యవహారంపై 2006లో శాసనసభా సంఘాన్ని నియమించగా భారీ అవినీతి చోటుచేసుకున్నట్లు తేల్చారు. ఇదిలా ఉండగా 2014లో ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ నిజాం షుగర్స్‌ను ప్రభుత్వపరం చేస్తామన్నారు. కానీ విచిత్రంగా 2015 డిసెంబర్ 23న ఫ్యాక్టరీ మూడుయూనిట్లను మూసేశారు. 2005 – 06లో చెరుకు 35వేల టన్నుల దిగుబడి ఉన్నప్పుడు నడిచిన ఈ కర్మాగారాలను, 2015లో లక్ష టన్నుల చెరుకు దిగుబడి ఉన్నప్పటికీ మూసేయడం గమనార్హం.

20 నుంచి కొనుగోళ్లు..!

- ధాన్యం సేకరణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసిన అధికారులు
- 8 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం
- 457 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- 2 కోట్ల గన్నీ బ్యాగులు అవసరమవుతాయని అంచనా
- నేడు జిల్లా ధాన్యం సేకరణ కమిటీ సమావేశం



సుభాష్‌నగర్ : వానాకాలం ధాన్యం సేకరణకు అదనపు కలెక్టర్ యాదిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం యాక్షన్ ప్లాన్ సిద్ధంచేసింది. ఈ నెల 20 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సొసైటీలు, మెప్మా, ఐకేపీ, డీసీఎంఎస్, తదితర సంస్థలు 457 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు సంబంధిత శాఖల అధికారులతో నేడు కలెక్టరేట్‌లో జిల్లా ధాన్యం సేకరణ కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నారు.

4 లక్షల ఎకరాల్లో వరిసాగు..

జిల్లావ్యాప్తంగా 4 లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారు. ఇప్పటికే పలు మండలాల్లో కోతలు మొదలయ్యాయి. వర్ని, మోస్రా, చందూర్, తదితర మండలాల్లో అధికశాతం రైతుల నుంచి దళారులు, రైస్‌మిల్లర్లు నేరుగా కొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు సగటున రూ.2,200 వరకు చెల్లిస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు ఏ గ్రేడ్‌రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 చెల్లిస్తున్నారు. మిగతా మండలాల్లోనూ ఇప్పుడిప్పుడే కోతలు ప్రారంభమయ్యాయి.

మరిన్ని గన్నీ బ్యాగుల కోసం..

జిల్లాలో సొసైటీలు, మెప్మా, ఐకేపీ, డీసీఎంఎస్, తదితర సంస్థల ద్వారా 457 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. వీటి ద్వారా సుమారు 8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ధాన్యం సేకరణకు 2 కోట్ల గన్నీ బ్యాగులు అవసరమని అధికారులు భావిస్తున్నారు. పాత బ్యాగులు అందుబాటులో ఉండగా, మరిన్ని బ్యాగుల కోసం ప్రతిపాదనలు పంపించారు.

ఈసారి టెండర్లు లేనట్లే..?

ధాన్యం సేకరణ పూర్తి ప్రక్రియలో రవాణా కీలకమైంది. జిల్లావ్యాప్తంగా అన్ని కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు ధాన్యం తరలించేందుకు నిర్వహించే టెండర్ ప్రక్రియ ఈసారి లేనట్లేనని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పాత వారినే కొనసాగించే అవకాశముందని సమాచారం. రవాణా వ్యవస్థలో లోపాల వల్ల అటు రైతులు.. ఇటు కేంద్రాల నిర్వాహకులు ప్రతి ఏడాది ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఈసారైనా పకడ్బందీగా చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అలాగే హమాలీలను ఇతర రాష్ట్రాల నుంచి అడ్వాన్స్‌లు ఇచ్చి రప్పిస్తున్నారు. ఈ ప్రక్రియను కేంద్రాల నిర్వాహకులు ఇప్పటికే పూర్తిచేశారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో..

ధాన్యం సేకరణ సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలపై శుక్రవారం జిల్లా ధాన్యం సేకరణ కమిటీ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. కలెక్టర్ సహా అదనపు కలెక్టర్, డీఎస్‌వో, డీసీవో, డీఎం, వ్యవసాయ అధికారులు, సెంటర్ ఇన్‌చార్జీలను సమావేశానికి ఆహ్వానించారు. ఇదేవిషయమై అదనపు కలెక్టర్ యాదిరెడ్డి వివరణ కోరగా, సమావేశం తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని, అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేశామని తెలిపారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి దసరా సెలవులు

నిజామాబాద్ అర్బన్ : నేటి నుంచి జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలలకు దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. నేటినుంచి ఈ నెల 25 తేదీ వరకు సెలవులు ప్రకటించారు. పాఠశాలలు తిరిగి ఈనెల 26 తేదీన పునఃప్రారంభం కానున్నాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులు వర్తిస్తాయి.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో గురువారం కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేపట్టారు. ఇన్‌చార్జి పోలీస్‌కమిషనర్, అదనపు డీసీపీ (లాఅండ్‌ఆర్డర్) ఎస్.జయ్‌రామ్ ఆదేశాల మేరకు నోడల్ అధికారి సీసీఆర్‌బీ ఏసీపీ ఎ.రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగింది. మొదటిరోజు 400 మంది అభ్యర్థులను పిలువగా, 390 మంది హాజరయ్యారు. శుక్రవారం కూడా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగనుంది. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, పరిపాలన అధికారి (ఏఓ) బి.శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, మక్సూద్ హైమద్, గోవింద్, సీపీఓ కార్యాలయ, రిజర్వు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి అర్చరీ పోటీలు

దోమకొండ: మండల కేంద్రంలోని గడికోటలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి అర్చరీ పోటీలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఉమ్మడి జిల్లా అర్చరీ అసోసియేషన్ కార్యదర్శి నర్సింహారెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి సీనియర్, జూనియర్ విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు శనివారం ఉదయం 8 గంటలలోపు గడికోటలో అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. నాలుగు ఫొటోలు, ఆధార్‌కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకుని రావాలని సూచించారు.


ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

నిజామాబాద్ అర్బన్ : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 31 తేదీలోపు వెబ్‌సైట్ http://bse.telangana.gov.in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పండుగల సందర్భంగా ఆర్టీసీ బంపర్ ఆఫర్

ఖలీల్‌వాడి : ఉమ్మడి జిల్లా ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఆర్టీసీ బంపర్ ఆఫర్ ప్రకటించినట్లు రీజినల్ మేనేజర్ జానీరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీ నుంచి 23వ తేదీవరకు అలాగే 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు బస్సుల్లో ప్రయాణించే వారు, అలాగే ఆయా తేదీల్లో ముందస్తు టికెట్ బుక్ చేసుకున్న వారు లక్కీడ్రాలో పాల్గొనవచ్చన్నారు. ప్రయాణం పూర్తయ్యాక టిక్కెట్ల వెనక ఆధార్‌లో ఉన్నట్లుగా పేరు, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్లలో ఏర్పాటు చేసిన గిఫ్ట్‌బాక్స్‌లో వేయాలన్నారు. డ్రాలో గెలుపొందిన ఐదుగురు మహిళలకు, ఐదుగురు పురుషులకు ఒక్కొక్కరికి రూ. 9,900 చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే గతనెల 20వ తేదీ నుంచి 30వ తేదీ మధ్య ప్రయాణం చేసి ఈనెల 15వ తేదీ నుంచి 29వ తేదీల మధ్య తిరుగు ప్రయాణం టిక్కెట్లను బుక్ చేసుకున్న ప్రయాణికులకు తిరుగు ప్రయాణం టిక్కెట్‌పై 10శాతం తగ్గింపు సౌకర్యం కల్పించామన్నారు.

వెల్‌నెస్ సెంటర్లో వైద్యులను నియమించాలి



నిజామాబాద్‌నాగారం : వెల్‌నెస్ సెంటర్‌లో కార్డియాలజీ, గైనిక్, స్పెషలిస్ట్ వైద్యులను నియమించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్–రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈహెచ్‌ఎస్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నరేంద్రకుమార్ గురువారం వినతి పత్రం అందజేశారు. లబ్ధిదారులకు అన్ని రకాల టెస్టులను ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహితంగా టెస్టులకు ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు, పట్టణ అధ్యక్షుడు సిర్ప హన్మాండ్లు తదితరులున్నారు.



ఎడపల్లిలోని జానంకపేట సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో బతుకమ్మలతో చిన్నారులు

ప్రారంభమైన బతుకమ్మ సంబురం

జిల్లావ్యాప్తంగా గురువారం బతుకమ్మ సంబురాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ పేర్చారు. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఏసీబీకి పట్టుబడ్డ ఆర్‌ఐ



అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు

ఖలీల్‌వాడి : జిల్లాలో సౌత్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మీసాల రాజు, రెవెన్యూ శాఖలో ప్రైవేట్ ఉద్యోగి హరీశ్ గురువారం ఏసీబీకి చిక్కారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని బంటు రామరాజుకు ఉన్న సర్వే నెంబర్ 2944/ఏలో 16 గుంట భూమి కోర్టు కేసులో ప్రొహిబిషన్‌లో ఉంది. ప్రొహిబిషన్ నుంచి తొలగించేందుకు ఆర్‌ఐ రాజు రూ. 10 వేలు డిమాండ్ చేయగా రూ. 8 వేలకు ఒప్పందం కుదిరింది. అయితే ఆర్‌ఐ డబ్బులు డిమాండ్ చేయడంతో బంటు రామరాజు ఏసీబీని ఆశ్రయించారు. గురువారం మధ్యాహ్నం ప్రైవేట్ ఉద్యోగి రూ.8 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆర్‌ఐ రాజు ఆదేశాల మేరకు డబ్బులు తీసుకున్నట్లు హరీశ్ చెప్పడంతో ఆర్‌ఐ రాజు, హరీశ్‌పై కేసు నమోదు చేశారు.

న్యాయం చేస్తారా? నట్టేట ముంచుతారా?

- పీఏసీఎస్ ఫేక్ బిల్లులపై కొనసాగుతున్న విచారణ
- 30 మంది రైతులకు టోకరా వేసిన అధికారులు
- అయోమయంలో రైతులు
- నిజామాబాద్ సహకార సొసైటీ తీరుపై సర్వత్రా చర్చ



నగరంలోని ప్రాథమిక సహకార సంఘం



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి.

సహకార సంఘం జారీ చేసిన ఫేక్ బిల్లులు

నిజామాబాద్‌రూరల్: నకిలీ బిల్లులు సృష్టించి తమను అధికారులు మోసం చేశారని, ఈ వ్యవహారంలో విచారణ చేపట్టిన అధికారులు తమకు న్యాయం చేస్తారో లేదా నట్టేట ముంచుతారోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. గూపన్‌పల్లి, కేశాపూర్, ముబారక్‌నగర్, అర్సపల్లి, నిజామాబాద్ అర్బన్ నిజామాబాద్ సహకార సంఘం పరిధిలోకి వస్తాయి. ఆయా ప్రాంతాలకు చెందిన 30 మంది రైతులు 2021–22 సంవత్సరానికి సంబంధించి రుణాలు, వడ్డీ చెల్లించగా, అప్పటి సీఈవో శివరామరాజు, క్యాషియర్ భాస్కర్ నకిలీ రసీదులు ఇచ్చి రూ.30 లక్షలు కాజేశారు. క్రాప్‌లోను చెల్లించామని అనుకున్న రైతులకు నిజామాబాద్ ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘం నుంచి నోటీసులు రావడంతో అవాక్కయ్యారు. రెడ్డి సుజాత అనే మహిళా రైతు 2021 జూలై 23న రూ.1,11,158 అసలు, వడ్డీ చెల్లించింది. కానీ ఆ డబ్బు సహకార సంఘంలో జమ కాలేదు. ఆమెకు మళ్లీ తిరిగి తీసుకున్న రుణం చెల్లించాలని నోటీసు వచ్చింది. విచిత్రం ఏమిటంటే ఆమెకు సహకార సంఘం సిబ్బంది నోడ్యూ సర్టిఫికెట్ కూడా జారీ చేశారు. అదేవిధంగా నరేశ్‌రెడ్డి అనే రైతు వడ్డీ డబ్బులు రూ.7060 చెల్లించగా, ఆయనకు సైతం నకిలీ రసీదు ఇచ్చారు. దీనిపై కలెక్టర్, డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ అధికారి సింహాచలానికి ఫిర్యాదుల అందాయి. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాల్సిందిగా సత్యనారాయణ అనే సీనియర్ అధికారిని నియమించారు.

మోసపోయిన 30 మంది రైతులు నకిలీ రసీదులను పట్టుకొని ఇప్పటికీ సహకార సంఘం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే విచారణ అధికారిగా వచ్చిన అధికారి అప్పట్లో పనిచేసిన శివరామరాజు ఇంటికెళ్లి మా డబ్బులు ఇవ్వమని అడగండి అని సూచించడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. విచారణ అధికారి ఇలా అనడం ఎంత వరకు సమంజసమని వాపోతున్నారు. విచారణ మాత్రం సుమారు మూడు నెలలుగా కొనసాగుతూనే ఉంది. విచారణ అధికారి సత్యనారాయణ ప్రభుత్వానికి, డీసీవోకు నివేదికను సమర్పించలేదు.

రైతులకు న్యాయం చేస్తాం

నిజామాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన అవినీతిపై గత మూడు నెలలుగా విచారణ కొనసాగుతున్నది. దీనికి సంబంధించిన వివరాలను త్వరలో కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు అందించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం.రైతులు మోసపోయిన రూ.30 లక్షలను రికవరీ చేస్తాం.

– సింహాచలం, డీసీవో

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి పరామర్శ



మాతృమూర్తి మంజుల మృతదేహం వద్ద విలపిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

వేల్పూర్ : మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజుల గురువారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన వేల్పూర్‌కు తీసుకొచ్చారు. ఎమ్మెల్యే జీవన్ రెడ్డితోపాటు పలువురు నేతలు, అధికారులు మృతదేహాన్ని సందర్శించిన నివాళులు అర్పించారు.

నేడు వేల్పూర్‌కు సీఎం కేసీఆర్

శుక్రవారం వేల్పూర్‌లో జరిగే మంజుల అంత్యక్రియలకు సీఎం కేసీఆర్ హాజరు కానున్నట్లు బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి.

డీసీసీబీ ఉద్యోగులకు పదోన్నతులు

- ఉత్తర్వుల పత్రాలు అందజేసిన చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి



సుభాష్‌నగర్ : నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ హెచ్‌ఆర్ పాలసీ నిబంధనలకు అనుగుణంగా ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 4 అసిస్టెంట్ మేనేజర్లకు మేనేజర్లుగా, 32 మంది క్లర్కులకు అసిస్టెంట్ మేనేజర్లుగా పదోన్నతి కల్పించారు. ఐబీపీఎస్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన వారికి చైర్మన్ అధ్యక్షతన ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు. పదోన్నతి పొందిన వారికి చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పత్రాలు అందజేశారు. బ్యాంక్ సీఈవో గజానంద్, ప్రొఫెషనల్ డైరెక్టర్ భూషణ్‌రెడ్డి, టీఎస్ క్యాబ్ ఏజీఎం సురేష్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురికి ప్రచార బాధ్యతలు

- అర్బన్, బోధన్‌కు ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్ నాగారం : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ పలువురికి ప్రచార బాధ్యతలు అప్పగించింది. గురువారం ఎన్నికల క్యాంపెయిన్ ఇన్‌చార్జీల జాబితాను విడుదల చేసింది. ఈ సందర్భంగా నిజామాబాద్ అర్బన్, బోధన్ నియోజక వర్గానికి ఎమ్మెల్సీ కవితకు ప్రచార బాధ్యతలు అప్పగించారు.

కామారెడ్డి క్యాంపెయిన్ ఇన్‌చార్జీగా కేటీఆర్

సాక్షి, కామారెడ్డి: సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గం బాధ్యతను ముగ్గురికి అప్పగించింది. మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ఎలక్షన్ క్యాంపెయిన్ ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ బాధ్యతలను మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌కు ఇచ్చారు. బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలకు ఇంకా ఎవరినీ నియమించలేదు.

ఎమ్మెల్సీ కవితకు నిజామాబాద్ అర్బన్‌తో పాటు బోధన్ నియోజకవ ర్గాల ప్రచార బాధ్యతలు అప్పగించారు. క్యాంపెయిన్ ఇన్‌చార్జీల నాయకత్వంలో ఆయా నియోజకవర్గాలలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



కేటీఆర్



కవిత



గంప గోవర్ధన్



వీజీ గౌడ్



శేరి సుభాష్‌రెడ్డి

క్లుప్తంగా

తెయూ సీవోఈ పదవీకాలం పొడిగింపు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి (సీవోఈ) ఎం అరుణ పదవీ కాలాన్ని పొడిగించారు. తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి గురువారం అరుణకు పదవీకాలం పొడిగింపు ఉత్తర్వులు అందజేశారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఆమె కంట్రోలర్ బాధ్యతల్లో కొనసాగుతారని తెలిపారు.

దిగుబడి అంచనాకు పంట కోత ప్రయోగం



బోధన్: ఎకరంలో వచ్చే దిగుబడిపై అంచనాకు వచ్చేందుకు పంట కోత ప్రయోగ కార్యక్రమం చేపట్టామని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. ఈ ప్రయోగంతో మండల, జిల్లా స్థాయిలో వచ్చే వరి పంట దిగుబడిని అంచనా వేయవచ్చని పేర్కొన్నారు. గురువారం బోధన్ మండలం పెంటాకుర్దు శివారులో రైతు శేఖర్ పొలంలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. కోసిన పంటను నూర్పిడి చేసి ధాన్యాన్ని తూకం వేశారు. ఏఈవో సాయి చరణ్, రైతులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



రెంజల్: సీసీ కెమెరాలతో దొంగతనాలను నివారించవచ్చని బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని బోర్గాం గ్రామస్తులకు సూచించారు. గురువారం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చే నెలలో జరిగే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ధ్రువపత్రాలు లేని 45 వాహనాలను సీజ్ చేశారు. రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్, రెంజల్, ఎడపల్లి, రుద్రూర్ ఎస్సైలు ఉదయ్‌కుమార్, విక్రమ్, సీరేష్ పాల్గొన్నారు.

పసుపు పంట పరిశీలన



బాల్కొండ: మెండోరా మండలం వెల్కటూర్‌లో పసుపు పంటను కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మహేందర్, పసుపు పరిశోధన శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఆయన పంట దిగుబడి, మార్కెటింగ్ ప్రణాళికల గురించి రైతులకు వివరించారు. సస్యరక్షణ చర్యలు వివరించారు. శ్రీనివాస్, పాలెం ప్రవీణ్, మధు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతి



లహరి(ఫైల్)

నిజాంసాగర్: అచ్చంపేట మోడల్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న లహరి(15) గురువారం మృతి చెందింది. ఒడ్డేపల్లి గ్రామానికి చెందిన గాయత్రి, బాబాగౌడ్ దంపతుల పెద్ద కూతురు లహరి మోడల్ పాఠశాలలో చదువుతోంది. 15 రోజుల కిందట వైరల్ ఫీవర్ రావడంతో లహరిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. జ్వరం తగ్గుముఖం పట్టగా నిమోనియా అటాక్ కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది.

జోరుగా కల్తీకల్లు దందా!


- బానిసవుతున్న యువత
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

డిచ్‌పల్లి మండలం గొల్లపల్లికి చెందిన ఓ యువకుడు గల్ఫ్ దేశానికి వెళ్లాడు. ఇక్కడ ఉన్న సమయంలో ఆయనకు గుల్బారం కల్లు అలవాటు ఉంది. గల్ఫ్ వెళ్లాక అక్కడ కల్లు దొరక్క మతిస్థిమితం కోల్పోయి ఎడారుల్లో తిరుగుతూ ప్రాణాలు కోల్పోయాడు. మూడు నెలల తరువాత అతని మృతదేహం స్వగ్రామానికి వచ్చింది. బర్ధీపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి కుడా గల్ఫ్‌లో కల్లు దొరక్క తిరిగి ఇంటికి వచ్చాడు. ఇలా ఎంతో మంది కల్తీ కల్లుకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.

నిజామాబాద్‌రూరల్: జిల్లాలో కల్తీకల్లు దందా జోరుగా సాగుతోంది. గుల్బారం కల్లును యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. కూలీ పనులు చేసుకునే వారు, రోజంతా కాయకష్టం చేసేవారు రాత్రి నిద్ర కోసం కల్లు తాగుతారు. అయితే ఈ కల్లును డైజోఫాం, క్లోరోఫాం, ఈస్ట్ లాంటి రసాయనాలతో తయారు చేస్తున్నారు. మద్యం కంటే తక్కువకు ధరకు దొరకుతున్న కృత్రిమ కల్లుకు యువత సైతం బానిసై మత్తులో మునిగి తేలుతున్నారు. గ్రామాల్లో అడుగు అడుగున కృత్రిమ కల్లు దుకాణాలు వెలిసి సామాన్య ప్రజలకు రోజు కృత్రిమ కల్లు తాగడం అలవాటుగా మారింది. దినసరి కూలీల నుంచి జాబ్‌లు చేసే వారి వరకు కల్తీ కల్లుకు బానిసలు అవుతున్నారు. రోజంతా కాయ కష్టం చేసి ఒక సీసా గుల్‌ఫారం కల్లు తాగితే నిద్రవస్తుందని కొందరు అలవాటుగా మార్చుకున్నారు. అక్టోబర్ 1 నుంచి కొత్త మస్తేదార్‌లు వచ్చారు. వీడీసీలకు ఏడాది డబ్బు కడితే చాలు.. వారు ఏది అమ్మినా పట్టించుకునే వారు కరువయ్యారు.

దొరక్కపోతే ఇబ్బంది

నిత్యం కల్తీ కల్లు తాగే వారు ఒకరోజు అది దొరక్కపోతే వింతగా ప్రవర్తిస్తారు. కల్లు దొరక్క చనిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. అయితే ఇక్కడ గ్రామాల్లో కల్లుకు అలవాటు పడ్డ వారు గల్ఫ్ దేశాలకు వెళ్లిన సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. బతుకు దెరువు కోసం తల్లిదండ్రులు, భార్యపిల్లలు, స్నేహితులను వదిలి ఉంటున్న వారు కల్లు లేకపోతే ఉండలేక ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ కల్లు, మద్యం దొరక్క పలువురు మతిస్థిమితం కోల్పోతే మరికొందరు ఇంటి బాట పట్టిన సందర్భాలు ఉన్నాయి. గల్ఫ్ వెళ్లేవారు రెండు మూడు నెలల ముందు నుంచే ఇక్కడ కల్లు అలవాటు మానుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.



బట్టీలో తయారు చేసిన కల్లు

చర్యలు శూన్యం

గ్రామాల్లో గుల్‌ఫారం, కృత్రిమ కల్లు తయారు చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ముస్తేదార్‌లు అందజేసే మామూళ్లు తీసుకొని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక పోలీస్‌లకు కూడా మామూళ్లు ముడుతున్నట్లు సమాచారం. దీంతో కల్లు బట్టీల్లో తనిఖీలు చేసే వారు కరువయ్యారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. గుల్‌ఫారం, కృత్రిమ కల్లుకు పలువురు బానిసలవుతున్నారు. ఇది ఆరోగ్యానికి హానికరం. యువత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి.

– కేశవులు, సైకాలజిస్టు

చర్యలు తీసుకుంటాం

ఎన్ఫోర్స్‌మెంట్ వింగ్స్, ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో కల్లు బట్టీలపై దాడులు కొనసాగుతున్నాయి. కల్లు బట్టీల్లో కృత్రిమ కల్లు తయారీని అడ్డుకుంటాం. దీనిపై కల్తీ కల్లు తయారు చేసే ముస్తెదార్ల లైసెన్స్‌లు రద్దు చేసి, కల్లు బట్టీలను మూసివేస్తాం.

– సింధు, ఎక్సైజ్ సీఐ

ఓటమి గెలుపునకు నాంది



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఆర్మూర్‌టౌన్: ఓటమి గెలుపునకు నాంది అని డీఐఈవో రఘురాజ్ అన్నారు. ఆర్మూర్‌లోని మినీ స్టేడియంలో బుధవారం ఉమ్మడి జిల్లాల అండర్–19 బాలబాలికల కబడ్డీ, ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొనగా 12 మందిని కబడ్డీ జట్టుకు, 12 మందిని ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక చేసినట్లు అండర్–19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గంగాధర్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 17నుంచి 19 వరకు సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌దాస్, వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి మల్లేష్‌గౌడ్, గంగాధర్, బాలికల కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దేవారాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐఈవో రఘురాజ్

తెయూలో 'జీన్స్ టు జినోమిక్స్' వర్క్‌షాప్



అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ ప్రకాశ్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం, ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఫెలోస్ సంయుక్తంగా 'జీన్స్ టు జినోమిక్స్' అనే అంశంపై గురువారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జేఎస్ఎస్ ప్రకాశ్ 'మాడ్రన్ టెక్నిక్స్ ఫర్ సైలెన్సింగ్ జీన్స్ ఇన్ బ్యాక్టీరియా' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 'డీకోడింగ్ లైఫ్ విత్ కోడ్స్' అనే అంశంపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ బయో ఇన్ఫర్మేటిక్స్ ప్రొఫెసర్ ముకులిక అవగాహన కల్పించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శారద 'డీఎన్ఏ' పూర్వాపరాలను, సినీ పై సొల్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ తాటి దయాకర్ 'అప్లికేషన్ ఆఫ్ క్వాంటం డాట్స్ ఇన్ ప్లాంట్ టీసీ కల్చర్' పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. తెయూ రిజిస్ట్రార్ ఎం యాదగిరి, వర్క్‌షాప్ కన్వీనర్ మామిడాల ప్రవీణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జవేరియా ఉజ్మా, అధ్యాపకులు మహేందర్, కిరణ్మయి, ప్రసన్నశీల పాల్గొన్నారు.

కియా కార్ల షోరూం ప్రారంభం



కియా షోరూంను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ శివారులో సన్‌రైజ్ కియా షోరూంను గురువారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కియా ఇండియా రీజినల్ మేనేజర్ జోంఘే రియూతో కలిసి ప్రారంభించారు. స్పీకర్ మాట్లాడుతూ.. వాహన రంగంలో తెలంగాణ అద్భుతంగా దూసుకెళ్తోందని, ఇందుకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు కారణమని తెలిపారు. కియా వంటి అంతర్జాతీయంగా పేరొందిన ఆటోమొబైల్ కంపెనీ జిల్లాలో షోరూం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కియా ఇండియా రీజినల్ మేనేజర్ జోంఘే రియూ కియా కారు ప్రత్యేకతలను వివరించారు. సన్‌రైజ్ కియా షోరూం చైర్మన్ పోచారం సురేందర్‌రెడ్డి, ఎండీ జీ రవికిరణ్‌గౌడ్, ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, హన్మంత్ సింధే, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మేయర్ దండు నీతూకిరణ్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, షోరూం మేనేజర్ సతీష్, నాయకులు చింత శ్రీనివాస్‌రెడ్డి, దాసరి లక్ష్మీనర్సయ్య, కృష్ణ, దండు గుల సాయిలు, నీరడి పద్మారావు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎంపిక

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధి లో నిర్వహించిన వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్–2024 పోటీల్లో నలుగురు వలంటీర్లు ఎంపికైనట్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి గురువారం తెలిపారు. పరేడ్‌కు ఎంపికైన వారిలో జాదవ్ మమత (గిరిరాజ్ కాలేజీ, నిజామాబాద్), మలావత్ సరిత (గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీ, నాగారం), మంద ప్రవీణ (నిశిత డిగ్రీ కాలేజీ, నిజామాబాద్), కుంచర్ల హారిక (సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీ, ఆర్మూర్) ఉన్నారు. వీరికి నవంబర్ 1 నుంచి 10 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో ప్రత్యేక శిక్షణనిస్తారని రవీందర్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను తెయూ రిజిస్ట్రార్ ఎం యాదగిరి అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఎడపల్లి: మండలంలోని ఎమ్మెస్సీ ఫారం వద్ద గురువారం పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. నిజామాబాద్ వైపు నుంచి బోధన్ వైపు అశోక్ లైలాండ్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. డ్రైవర్ అయూబ్ ఖాన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

గుండారం విద్యార్థినికి ప్రధాని ప్రశంస



చైతన్యశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నిజామాబాద్ రూరల్: మండలంలోని గుండారం ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని చైతన్యశ్రీకి ప్రధాని నరేంద్ర మోదీ నుంచి ప్రశంసలు అందాయి. జూలైలో ప్రధానమంత్రి నిర్వహించిన పరీక్ష పే చర్చలో చైతన్యశ్రీ పాల్గొన్నట్లు హెచ్ఎం అమర్‌నాథ్ తెలిపారు. దీంతో ప్రధాని అభినందిస్తూ లేఖ పంపారని పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

మాక్లూర్: మండలంలోని రాంచంద్రపల్లిలోని ఒడ్డెర కాలనీకి చెందిన ముదుగుల హేమలత (35) ఈ నెల 4 నుంచి కనిపించడం లేదని ఆమె భర్త శంకర్ గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. కాలనీ నుంచి గుత్ప తండాకు కూలీ పనులకని వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

రుద్రూర్: రుద్రూర్ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్, ఆయిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు ఎస్సై సీరేష్ తెలిపారు. బుధవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ కాయిల్, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై స్థానిక రైతులు గురువారం ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుత్ తీగలు పడి మహిళకు గాయాలు



చికిత్స పొందుతున్న కళావతి

నిజామాబాద్ రూరల్: విద్యుత్ వైర్లు తెగిపడి మండలంలోని కాలూర్ గ్రామానికి చెందిన కళావతి గాయపడింది. వివరాలు.. కళావతి పొలానికి వెళ్లిన సమయంలో పైనున్న తీగలు తెగిపడ్డాయి. తీవ్రంగా గాయపడ్డ ఆమెను నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు విద్యుత్ అధికారులే నిర్లక్ష్యమని గ్రామస్తులు ఆరోపించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అనిల్(ఫైల్)

ఇందల్వాయి: ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి శివారులో విశ్వ అగ్రోటెక్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రయాన్‌పల్లికి చెందిన అనిల్(33) మృతి చెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై మహేశ్ తెలిపారు. వివరాలు.. అనిల్ బుధవారం సాయంత్రం డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామానికి బైక్‌పై వెళ్లి వస్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడ్డ ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య నవనీత ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని ఒకరు..

కామారెడ్డి క్రైం: కారు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ బైపాస్ సమీపంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు.. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరిపినగండ్ల గ్రామానికి చెందిన దూదెకుల బాబు (55) సెంట్రింగ్ పనుల నిమిత్తం కామారెడ్డికి వచ్చాడు. ఉదయం 7 గంటల ప్రాంతంలో టేక్రియాల్ సమీపంలో నడుచుకుంటు వెళ్తుండగా నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి అతడిని వెనక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతుడి తమ్ముని కుమారుడు సలీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

తమ్ముడు జైలుకు వెళ్లాడని అన్న ఆత్మహత్య



నిషాంత్(ఫైల్)

భిక్కనూరు: చోరీ కేసులో తమ్ముడు అరెస్టై జైలుకు వెళ్లడంతో అవమానంగా భావించిన అన్న ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లిలో గురువారం ఈ సంఘటన జరిగింది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జంగంపల్లి గ్రామానికి చెందిన తిప్పని నిషాంత్ (23) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడి తమ్ముడు నితిన్ చోరీ కేసులో 15 రోజుల క్రితం అరెస్టై జైలులో ఉన్నాడు. అప్పటి నుంచి నిషాంత్ అవమానభారంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన నిషాంత్ రాత్రి అయినా ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం పొలం వద్దకు వెళ్లగా అక్కడ నిషాంత్ మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. మృతుడి తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..



తిర్మల్‌రెడ్డి మృతదేహం

భిక్కనూరు: మండలంలోని కంచర్లకు చెందిన తిర్మల్‌రెడ్డి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన మడప తిర్మల్‌రెడ్డి (45) కొన్ని రోజులుగా అప్పులు బాగా అయ్యాయని మదన పడుతుండేవాడు. బుధవారం సాయంత్రం తన పొలం వద్దకు వెళ్లి అక్కడ ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం వేకువ జామున చుట్టుపక్కల రైతులు దీన్ని చూసి తిర్మల్‌రెడ్డి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు అరవింద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎడపల్లి: మండలంలోని షాటాపూర్ గేటు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఎడపల్లికి చెందిన సుధాకర్(42) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సుధాకర్ బుధవారం ఎడపల్లి నుంచి నిజామాబాద్ వెళ్తుండగా టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రం తెలిపారు.

ఏటీఎంల చోరీకి యత్నించిన నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి సీపీ జయరాం

ఖలీల్‌వాడి: రెండు ఏటీఎంలలో చోరీకి యత్నించిన ముగ్గురిని, వారికి సహకరించిన మహిళను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి సీపీ జయరామ్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్ గ్రామంలోని నంబర్ వన్ ఏటీఎంలో సెప్టెంబర్ 8న రాత్రి జక్రాన్‌పల్లికి చెందిన అల్లేపు స్వామి, దేవేందర్, ఆర్మూర్‌కు చెందిన నవీన్ చోరీకి యత్నించారు. అంతకుముందు వారు ఆర్మూర్ మండలం మచ్చర్లలో బైక్ దొంగతనం చేసి బడాభీమ్‌గల్ వెళ్లారు. అక్కడ ఏటీఎంలో చోరీకి యత్నించగా నగదు ఉన్న బాక్స్ ఓపెన్ కాలేదు. దీంతో అక్కడి నుంచి వారు పారిపోయారు. అక్టోబర్ 10న వేల్పూర్ మండలం అంక్సాపూర్‌లో ఈ ముగ్గురు నిందితులు యూనియన్ బ్యాంక్ ఏటీఎంను చోరీ చేయాలని పథకం వేశారు. ముందుగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్, ట్రాలీ ఎత్తుకెళ్లి వాటిలో ఏటీఎంను తీసుకెళ్లాలని ప్లాన్ వేశారు. ఏటీఎంను పగులగొట్టి అందులో డబ్బులు ఉన్న బాక్స్‌ను ట్రాక్టర్‌లోకి పెట్టే సమయంలో చుట్టు పక్కల నుంచి శబ్దం రావడంతో వాటిని అక్కడే వదిలి పారిపోయారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. వీరిపై ఇళ్లలో బంగారం దొంగతనం చేసిన కేసులు ఉన్నాయి. వీరు చోరీ చేసిన బంగారాన్ని అల్లేపు స్వామి భార్య శైలజ అమ్మి పెట్టేంది. దీంతో నలుగురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ జగదీశ్ చందర్, సీసీఎస్ ఏసీపీ విజయసారథి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు హరి బాబు, రాజ శేఖర్ ఉన్నారు.

పోచంపాడ్ ఏటీఎం చోరీ కేసులో ఒకరు..

మెండోరా మండలం పోచంపాడ్‌లో ఏటీఎంలో చోరీకి పాల్పడిన ఒకరిని అరెస్ట్ చేశామని, ఈ కేసులో మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు ఇన్‌చార్జి సీపీ జయరామ్ తెలిపారు. హర్యానాకు చెందిన జన్నైల్, అఫ్జల్ అలియాస్ అబ్దుల్, సాజిద్ అలియాస్ షాంతూ, సాబిర్, హనీఫ్, హనీఫ్ త్వరగా డబ్బు సంపాదించడానికి చోరీలు చేయాలని పథకం పన్నారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 27న డిచ్‌పల్లిలో బైక్ దొంగతనం చేశారు. కొంతదూరం వెళ్లిన తర్వాత కారు చోరీ చేశారు. దానిలో నిర్మల్ వెళ్తుండగా దూదిగాం దగ్గర ఎన్‌హెచ్–44 పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం షట్టర్ తాళాలు పగులగొట్టారు. అందులోని రూ.12,46,500 నగదు చోరీ చేశారు. పోచంపాడ్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యం గాలింపు చేపట్టారు. జన్నైల్ తన లారీని ఔరంగాబాద్‌లో టమాట లోడ్‌కు పెట్టి మిగతా నిందితులతో హర్యానాకు వెళ్లారు. గురువారం లారీలో జన్నైల్ నిజామాబాద్‌కు వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. లారీని స్వాధీనం చేసుకొని, మిగతా నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీపీ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నిజామాబాద్‌రూరల్: మండలంలోని మల్కాపూర్, గొల్లగుట్ట తండా, చక్రధర్‌నగర్ తండా, నాగరం తండాల్లో దాడులు చేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథం తెలిపారు. ఈ దాడుల్లో గుడుంబా తయారీకి ఉపయోగించే 600 లీటర్ల బెల్లం పానకం పట్టుకొని ధ్వంసం చేశామన్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్, సూపరింటెండెంట్ మల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టుషాపుపై..

నవీపేట: మండలంలోని ఆశాజ్యోతి కాలనీలో గురువారం జరిపిన దాడిలో లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. బాలరాజు గౌడ్‌కు చెందిన కిరాణా షాపులో రూ.నాలుగు వేలు విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

బస్టాండ్‌లో దొంగల హల్‌చల్



పోలీసులతో మాట్లాడుతున్న బాధితురాలు లక్ష్మి

కామారెడ్డి క్రైం: కామారెడ్డి బస్టాండ్‌లో దొంగలు రెచ్చిపోతున్నారు. ఓ మహిళా బ్యాగులో ఉన్న 14 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. వివరాలు.. సిరిసిల్లకు చెందిన నాంపల్లి లక్ష్మి కామారెడ్డికి వచ్చి తిరిగి వెళ్లేందుకు కొత్త బస్టాండ్‌కు వచ్చింది. వాటర్ బాటిల్‌ను కొనేందుకు ఓ దుకాణం వద్దకు వెళ్లింది. బాటిల్ కొనేలోపు పక్కనే ఉంచిన బ్యాగు చోరీకి గురైంది. అందులో 14 తులాల బంగారం ఉన్నట్లు బాధితురాలు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే మరో ప్రయాణికుడి జేబులో నుంచి రూ.10 వేల వరకు దొంగలు చోరీ చేసినట్లు అక్కడ ఉన్నవారు తెలిపారు.

పోలీసుల అదుపులో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా!

నిజాంసాగర్(జుక్కల్): ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, కాపర్ వైర్లు, ఆయిల్ చోరీ చేస్తున్న దొంగల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాలతో పాటు మరికొన్ని జిల్లాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు చేస్తున్న నలుగురిని బాన్సువాడ సర్కిల్‌తో పాటు నిజాంసాగర్ పోలీసులు పట్టుకున్నారు. జహీరాబాద్ ప్రాంతానికి చెందిన నలుగురు ఏడాదిగా ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల నిజాంసాగర్ మండలం ఆరేడ్ గ్రామ శివారులో మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లు, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు స్థానిక రైతులు, ట్రాన్స్‌కో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న బాన్సువాడ రూరల్ సీఐ మురళి దొంగల కోసం గాలించారు. ఈ క్రమంలో జహీరాబాద్ ప్రాంతానికి చెందిన అనుమానితులను పట్టుకొని విచారించడంతో నేరం ఒప్పుకున్నట్లు తెలిసింది. పట్టుబడిన నిందితులను స్పెషల్ పార్టీ పోలీసులు, బాన్సువాడ డీఎస్పీ, సీఐ ఆధ్వర్యంలో విచారిస్తున్నట్లు సమాచారం.